
సాక్షి ఒడిశా

శనివారం ౹ 14 ౹ డిసెంబర్ ౹ 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 4,95,097

వెండి : 13 గ్రాముల 600 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



అలరించిన నృత్యాలు

కొలనారలోని చైతీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. నృత్యాలు ఆకట్టుకున్నాయి.

- 8లో.

కరెన్సీతో అలంకరణ

గుడారిలో ధనలక్ష్మి పూజలు ఘనంగా జరిగాయి. అమ్మవారిని కరెన్సీతో అలంకరించారు.



- 8లో.

రత్నభాండాగారం మరమ్మతుకు కసరత్తు

- జీపీఆర్, రాడార్ నివేదిక ఆధారంగా శ్రీ మందిరం రత్న భాండాగారం మరమ్మతు: కలెక్టర్
- స్వామి సేవాదులు, దర్శనం యథాతథం
- ప్రత్యేక అధికారుల బృందం పర్యవేక్షణ



సిద్ధార్థ్ శంకర స్వంయి, పూరీ జిల్లా కలెక్టర్

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని నగలు, ఆభరణాలు ఇతరేతర విలువైన సొత్తు భద్రపరిచే రత్న భాండాగారం మరమ్మతు పనుల కోసం రంగం సిద్ధమైంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారిక కార్యాచరణ ఎస్‌ఓపీ జారీ అయిందని పూరీ జిల్లా కలెక్టరు సిద్ధార్థ్ శంకర స్వంయి శుక్రవారం తెలిపారు. దీని ప్రకారం ఈ నెల 17 నుంచి రత్న భాండాగారం మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. జీపీఆర్, రాడార్ నివేదిక సమాచారం ఆధారంగా ఈ పనుల్ని అత్యంత జాగ్రత్తగా చేపడతారని వివరించారు. భారత పురావస్తు శాఖ ఏఎస్‌ఐ ప్రత్యక్ష పర్యవేక్షణలు కొనసాగుతాయి.

శ్రీ మందిరంలో రత్న వేదికపై కొలువు దీరిన దేవతల నిత్య పూజలు, సేవాదులకు ఏమాత్రం అంతరాయం లేకుండా, భక్తులకు సర్వ దర్శనం భంగం కలగకుండా రత్న భాండాగారం పనులు కొనసాగించాలని నిర్ణయించడం విశేషం. ఇటీవల జరిగిన ఛత్తీషా నియోగుల సమావేశంలో ఈ మేరకు మార్గదర్శకాలు ఖరారు చేశారు. వీటి అమలు, వాస్తవ కార్యాచరణపై శుక్రవారం జిల్లా కలెక్టరు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశం తీర్మానం ప్రకారం ఈ నెల 17వ తేదీ నుంచి మరమ్మతు పనులు చేడతామని భారత పురావస్తు శాఖ అధికారి తెలిపారు. తొలుత మరమ్మతు పనులు చేపట్టేందుకు వీలుగా ఇనప కంచెతో భద్రత కల్పిస్తారు. తొలుత రత్న భాండాగారం వెలుపల తదుపరి లోపలి భాగం మర్మతు పనులు చేస్తారు. నిత్యం 4 నుంచి 5 గంటలపాటు నిరవధికంగా పని చేస్తారు. పాతబడి, బలహీన పడిన ఇనప కడ్డీలు, రాళ్లని తొలగించి కొత్తవి ఏర్పాటు చేయనున్నట్లు ఏఎస్‌ఐ డిప్యూటీ సూపరింటెండెంట్ చిత్తరంజన దాస్ తెలిపారు.

మహా లఘు దర్శనం

రత్న భాండాగారం మరమ్మతు పనుల నేపథ్యంలో శ్రీ మందిరం రత్న వేదికపై మూల విరాటుల్ని భక్తులు, యాత్రికులు అల్లంత దూరం నుంచి మహా లఘు దర్శనం పొందాల్సి ఉంటుంది. స్వామి దైనందిన పూజా కార్యక్రమాలకు, భక్తుల దర్శనానికి అంతరాయం లేకుండా నిత్యం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఈ పనులు ప్రారంభించేందుకు సమయం ఖరారు చేశారు. రత్న భాండాగారం వెలుపల, లోపల పనులు పూర్తి చేసి ఆభరణాలు, నగలు ఇతరేతర అమూల్య సంపద లెక్కింపు ప్రారంభించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ పనుల పర్యవేక్షణ కోసం ఢిల్లీ నుంచి భారత పురావస్తు శాఖ పత్యేక అధికారుల బృందం విచ్చేస్తుందని తెలిపారు.

న్యూస్‌రీల్

రాగుల ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ సహోట

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహోట శుక్రవారం రాగుల మండీలకు సంబంధించి ప్రచార రథాన్ని ప్రారంభించారు. రాగుల క్రయ, విక్రయాలకు సంబంధించి రైతులు ప్రభుత్వ ధరను తెలుసుకోవడంతో పాటు, ఏఏ ప్రాంతాల్లో వారు విక్రయించే అవకాశాలు ఉన్నాయో సమాచారాన్ని ఈ ప్రచార రథం ద్వారా అవగాహన కల్పించేందుకు సన్నాహాలు చేపట్టామని ఆమె చెప్పారు. కిలో రాగుల ధర రూ.45 లుగా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాగులు పండించే రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ తరహా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ



నిత్యావసర వస్తువులను అందజేస్తున్న నళిని

రాయగడ: స్థానిక రైతుల కాలనీలోని నవజీవన్ ట్రసుస్ట ఆధ్వర్యంలో నిరుపేదలైన 40 మంది ఆదివాసీ వృద్ధ మహిళలకు శుక్రవారం బియ్యం, కందిపప్పు, నూనె, దుంపలు తదితర నిత్యావసర వస్తువులను ట్రస్టు నిర్వాహకురాలు ఎం.నళిని పంపిణీ చేశారు. ప్రతినెల ఇటువంటి తరహా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆమె చెప్పారు. ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీధర్ ఆచారి అందుకు అవసరమైన వస్తువులను ప్రతినెల సమకూరుస్తున్నారన్నారు.

వాలీబాల్ విజేత తెరువలి జట్టు



ఫైనల్‌లో తలపడుతున్న కొత్తపేట, తెరువలి జట్లు

రాయగడ: చైతీ క్రీడోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో వాలీబాల్ ఫైనల్ పోటీలు జరిగాయి. కొత్తపేట, తెరువలి జట్ల మధ్య జరిగిన పోటీ రసవత్తరంగా మారింది. చివరకు తెరువలి జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు ఈ నెల 26 వ తేదీన జరగనున్న జిల్లా స్థాయి చైతీ ఉత్సవాల్లో బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహక కమిటీ తెలియజేసింది.

ఉత్సాహంగా భాగవత ప్రవచనములు



ప్రవచనములు చెబుతున్న పండిత చందో చరణ్ దాస్‌జీ

పర్లాకిమిడి: స్థానిక పెద్ద రాధాకాంతమఠంలో శ్రీమద్ భాగవత్ ప్రవచనములు రెండు రోజులుగా ఉత్సాహంగా జరుగుతున్నాయి. స్వామి చందో చరణ్ దాస్‌జీ శుక్రవారం గజేంద్ర మోక్షంపై భక్తులకు విన్నవించారు. పండిత రామనాథసాహు వార్షికోత్సవం సందర్భంగా పెద్ద రాధాకాంత మఠంలో భాగవత ప్రవచనములు నిర్వహిస్తున్నారు. ఈనెల 15 వరకూ ప్రవచనములు కొనసాగుతాయి.



హాజరైన భక్తులు

సంప్రదాయాలను కాపాడాలి

- మాల్యవంత్ ఉత్సవాల ప్రారంభంలో సీఎం మోహన్ చరణ్ మాఝి



మాల్యవంత్ మహోత్సవం ప్రారంభం కార్యక్రమంలో సీఎం మోహన్ చరాణ్ మాఝి తదితరులు



అధికారులతో మాట్లాడుతున్న సీఎం మోహన్ చరణ్ మాఝి

మల్కన్‌గిరి: సంప్రదాయాలను కాపాడుకోవాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అన్నారు. మల్కన్‌గిరి జిల్లాలో మాల్యవంత్ మహోత్సవాలను శుక్రవారం రాత్రి ఏడు గంటల సమయంలో సమయంలో మాల్యవంత్ మండపంపై జగన్నాథ్ స్వామి విగ్రహం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి.. బోండా నృత్యంతో ఉత్సవాలను సీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి నిత్యానాందో గోడో, నవరంగపూర్ ఎంపీ బోలభద్ర మాఝి, జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్, చిత్రకొండ ఎమ్మెల్యే మంగు ఖీలో, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి పాల్గొన్నారు. ఒడిస్సీ, ఆదివాసీ ధింసా, కోయ నృత్యం, అవుమా గురుకులం విద్యార్థులు జోడో ప్రదర్శన ఆకట్టుకోగా.. అసాం బిహు నృత్యం అలరించింది.

• విద్యార్థులకు పోటీలు



విజేతలతో అతిథులు, ఉపాధ్యాయులు

పర్లాకిమిడి: మత్తు పదార్థాల విముక్తి అభియాన్‌పై స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ, ప్రబంధాలు, చిత్రకళా పోటీలను జిల్లా సామాజిక సురక్షా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పోటీలు డీఎస్ఎస్‌వో సంతోష్ కుమార్‌నాయక్ అధ్యక్షతన జరగ్గా.. న్యాయనిర్ణేతలుగా డి.శ్రీరాంమూర్తి, సబ్‌డివిజనల్ సామాజిక సురక్షా అధికారిని ఉత్సర్‌గీతా బోడో రయి పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో 42 మంది విద్యార్థులు పాల్గొనగా 18 మంది విజయం సాధించారు. వీరికి అతిథులు బహుమతులను ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు శేషగిరి బెహారా అతిథులకు ధన్యవాదాలు తెలియజేశారు.



విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న అతిథులు

సీఎం దృష్టికి రాయగడ సమస్యలు



సీఎం మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిద్యులత, బాదల్ థా తదితరులు

రాయగడ: జిల్లాలో తాండవిస్తున్న వివిధ సమస్యలకు సంబంధించి ఆదివాసీ నాయకురాలు బిద్యులత హుయిక, ప్రముఖ సామాజిక సేవకుడు డాక్టర్ బాదల్ కుమార్ థా తదితరులు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝిని గురువారం కలిసి ఒక వినతిపత్రం సమర్పించారు. ఆదివాసీ హరిజన ప్రాంతమైన ఈ జిల్లాలో అత్యధిక శాతం గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందడం లేదని పేర్కొన్నారు. అదేవిధంగా విద్యారంగంలోనూ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని వివరించారు. తాగు, సాగునీటి సమస్యలు వేరే చెప్పనక్కర్లేదని పేర్కొన్నారు. సరైన రహదారులు లేక అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని వివరించారు. నిండు గర్భిణులను డోలీల్లో ఆస్పత్రులకు తీసుకెళ్లాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయని విన్నవించారు. ఇప్పటికైనా చర్యలు తీసుకొని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

బాబోయ్ చలి

వాతావరణ శాఖ జారీ చేసిన తాజా సమాచారం ప్రకారం పలు ప్రాంతాల్లో రాత్రి పూట కనీస ఉష్ణోగ్రత వివరాలు

ప్రాంతం	కనీస ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)
జి. ఉదయగిరి	9.2
రాఉర్కెలా	10.2
ఝర్సుగుడ	10.4
కిరై	10.7
కెందుఝురా	11.2
అంగుల్	11.6
కొరాపుట్	11.8
ఢెంకనాల్	12.3
దారింగిబాడి	12.5
బరిపద	12.5
భవానిపట్న	12.2
ఫుల్బణి	12.0
సుందరగడ్	12.0
కటక్	13.6
భువనేశ్వర్	15.0

భువనేశ్వర్: రాష్ట్రంలో చలి తగ్గినట్లే తగ్గి అకస్మాత్తుగా పెరిగింది. గురువారం రాత్రి నుంచి ఈ పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో పలు చోట్ల గురువారం రాత్రి పూట కనీస ఉష్ణోగ్రత 1 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ వరకు దిగజారినట్లు స్థానిక ప్రాంతీయ వాతావరణ కేంద్రం సమాచారం. మారు మూల ప్రాంతాలతో దక్షిణ, ఉత్తర, కోస్తా ఒడిశా ప్రాంతాల్లో చలి పెరిగింది. జి.ఉదయగిరి ప్రాంతంలో రాత్రి పూట కనీస ఉష్ణోగ్రత 10 డిగ్రీల సెల్సియస్‌కు దిగజారింది. కోస్తా ఒడిశాలో రాత్రి పూట కనీస ఉష్ణోగ్రత 13 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. రానున్న రోజుల్లో రాత్రి పూట కనీస ఉష్ణోగ్రత మరింత తగ్గే అవకాశం ఉంది. ఈ నెల 16వ తేదీ వరకు వాతావరణం పొడిగా ఉంటుంది. ఈ నెల 20వ తేదీ తర్వాత చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ చెబుతోంది. మంచు దట్టంగా కమ్ముకుంటూ ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

రాజ్యసభ సభ్యుడిగా సుజిత్ కుమార్ ఏకగ్రీవం

భువనేశ్వర్: రాష్ట్రం నుంచి రాజ్యసభకు సుజిత్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. నామినేషన్ల పరిశీలన, ఉప సంహరణ గడువు శుక్రవారంతో ముగిసింది. బరిలో వేరొకరు లేకపోవడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అధికారులు ప్రకటించారు. ఈయన భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా ఎగువ సభకు ఎన్నికయ్యారు.

చైతీలో స్థానిక కళాకారులకు అవకాశం



రాయగడ ఆదివాసీ నృత్య ప్రదర్శన



శివతాండవ నృత్యం



రాజస్థానీ జానపద నృత్యం

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరగనున్న జిల్లాస్థాయి చైతీ వేదికలో ఈసారి స్థానిక కళాకారులకు అవకాశం కల్పించేందుకు చైతీ ఉత్సవ కమిటీ సన్నాహాలు చేస్తోంది. గత కొన్నేళ్లుగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కళాకారులకు కమిటీ ప్రాధాన్యతను కలిపిస్తుండేది. దీంతో ఈసారి కలెక్టర్, చైతీ ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు ఫరూల్ పట్వారి స్థానిక కళాకారులకు అవకాశం కల్పించాలని కమిటీ సభ్యులకు ఆదేశించారు. ఈ మేరకు స్థానిక బిజు పట్నాయక్ ఆడిటోరియంలో అందుకు సంబంధించి ఆడిషన్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు ఈ ఆడిషన్స్‌లో పాల్గొన్నారు. ఆడిషన్‌లో 20 బృందాలను ఎంపిక చేశారు. న్యాయనిర్ణేత కమిటీలో సర్మిష్టా కుమారి సస్మాల్, దేవి శ్రీ ప్రసాద్, అవినాష్ మండల్‌లు ఉన్నారు. ప్రస్తుతం 20 బృందాలను ఎంపిక చేసిన కమిటీ, మరో 40 బృందాలను ఎంపిక చేయనుంది. ఎంపికైన 60 బృందాలు చైతీ వేదికపై తమ ప్రదర్శనలు ఇస్తారు.

బాలిక అపహరణ



పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు శోబిత్

జయపురం: బాలికను అపహరించి లైంగిక దాడి జరిపిన ఒక యువకుడిని జయపురం మహిళా పోలీసు స్టేషన్ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వ్యక్తి ఖుర్దా జిల్లా బలిపట్న పోలీసు స్టేషన్ అభయముఖీ గ్రామం శోబిత్ ఖుండ(20)గా తెలిపారు. శోబిత్ ఖుండ్ స్థానిక మదలాసాహిలో ఉండేవాడు. మూడేళ్ల నుంచి శోబిత్ బాలికతో ప్రేమాయణం నడుపుతున్నాడు. ఒకసారి ఆ బాలికను తీసుకుపోయాడు. ఆ సంఘటనపై జయపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు బాలికను రక్షించి ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. గత నవంబర్ 24వ తేదీన ఆ బాలిక బొరిగుమ్మ ప్రాంతంలో ఉండగా శోబిత్ మరోసారి అపహరించి తీసుకుపోయాడు. ఈ విషయంపై బాలిక తల్లిదండ్రులు జయపురం మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు మహిళా పోలీసు అధికారి అజీత కుహార్ శుక్రవారం వెల్లడించారు. పోలీసు టీమ్ ఖుర్దా జిల్లా బలిపట్న పోలీసు స్టేషన్ పరిధిలోని అభయముఖీలో శోబిత్‌ను అరెస్టు చేసి, బాలికను తీసుకువచ్చారు. బాలికకు వైద్య పరీక్షలు జరిపించి ఆమె వాంగ్మూలాన్ని రికార్డు చేసినట్లు అధికారి వెల్లడించారు.

రాష్ట్రాలు తరలిపోతున్న వరి



అధికారుల ఆధీనంలో వరి రవాణా ట్రక్కు

భువనేశ్వర్: రాష్ట్రంలో వరి సేకరణ, కొనుగోలు ప్రక్రియ చురుగ్గా కొనసాగుతోంది. ఇరుగు పొరుగు రాష్ట్రాల వరి కొనుగోలుపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. సరిహద్దు ప్రాంతాల్లో అంతర రాష్ట్ర వరి రవాణా వాహనాల చొరబాటు నివారణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. ఈ కట్టుబాట్ల మధ్య శుక్ర వారం పొరుగు పశ్చిమ బెంగాలు రాష్ట్రం రిజిస్టరు నంబరుతో కూడిన సరుకు రవాణా ట్రక్కుని స్థానికులు గుర్తించారు. వరిని తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. పొరుగు పశ్చిమ బెంగాలు రైతు రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలకు విరుద్ధంగా దొడ్డి దారిలో వరిని మండీలకు తరలిస్తున్నట్లు సమాచారం. ఈ పరిస్థితిని స్థానిక ఆహార, పౌర సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ అధికారులకు తెలియజేశారు. అధికారులు రంగంలోకి దిగి అనుమానాస్పద వరి రవాణా ట్రక్కుని అదుపులోకి తీసుకున్నారు. వాహనం కాగిత పత్రాల ప్రకారం వాస్తవ యజమాని అందుబాటులోకి రానట్లు అధికార వర్గాలు తెలిపాయి. పశ్చిమ ఒడిశా సంబలపూర్ జిల్లా ధన్‌కొడ మండలం సత్తుపల్లి గ్రామం సమీపంలో వరి రవాణా సందిగ్ధ ట్రక్కుని గ్రామస్తులు గుర్తించారు. ధన్‌కొడ మండల సరఫరా అధికారి ప్రత్యక్షంగా ఘటనా స్థలాన్ని సందర్శించి ఆరా తీశారు. ట్రక్కులో సుమారు 200 క్వింటాళ్ల వరి ఉన్నట్లు భావిస్తున్నారు. ట్రక్కుని అదుపులోకి తీసుకుని కర్డోలా గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిలిపారు.

నీటిమట్టం తగ్గుదల



తెలింగిరి డ్యామ్‌లో తగ్గుతున్న నీటి మట్టం

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ తెలింగిరి సాగునీటి ప్రాజెక్టు డ్యామ్ లీకేజ్ కారణంగా జలాశయంలో నీటిమట్టం తగ్గుతోంది. ఇప్పటి వరకు 18 మీటర్ల నీటిమట్టం తగ్గిందని అధికార వర్గాలు తెలిపాయి. డ్యామ్ లీకేజీ కారణంగా జలాశయం నుంచి రోజుకు 1 మీటరు చొప్పున నీరు బయటకు పోతోందని తెలిపారు. నీటిమట్టం తగ్గుతున్న కారణంగా శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదు. రబీ సీజన్ పంటలకు జయపురం, బొరిగుమ్మ, కొట్పాడ్ సమితుల్లో దాదాపు పదివేల ఎకరాలకు సాగునీరు అందదని తెలిపారు. రానున్న 15 రోజుల్లో జలాశయం పూర్తిగా ఎండిపోతుందని, డ్యాక్ లీకేజీ కప్పేందుకు మరమ్మతులు ప్రారంభిస్తామని అధికారులు పేర్కొన్నారు.

69వ వృత్తిపరమైన పోటీలు ప్రారంభం

భువనేశ్వర్:

రాష్ట్ర పోలీసు 69వ వృత్తిపరమైన పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కటక్ రిజర్వ్ పోలీస్ గ్రౌండులో ఈ పోటీలను రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ యోగేష్ బహదూర్ ఖరానియా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 34 పోలీసు జిల్లాల నుంచి 313 మంది పోటీల్లో పాల్గొంటున్నారు. వీరిలో 41 మంది ఇన్‌స్పెక్టర్లు, 44 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 63 మంది సహాయ సబ్ ఇనస్పెక్టర్లు, 142 మంది కానిస్టేబుళ్లు, 23 మంది పోలీసు స్వాన్ (కె - 9) ఉన్నారు.



గౌరవ కవాతు స్వీకరించిన పోలీసు డైరెక్టర్ జనరల్ వైబీ ఖురానియా



వృత్తిపరమైన పోటీల ప్రారంభోత్సవ పరేడ్

అలరించిన నృత్యాలు

రాయగడ కొలనారలో చైతీ సమితి స్థాయి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్, వాటర్ షెడ్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దయానిధి బాగ్ తదితరులు హాజరయ్యారు. నాగావళి నది నుంచి కలశాలతో తీసుకువచ్చిన శుద్ధజలాలను ఉత్సవ వేదిక వద్ద ఉంచి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం స్థానికంగా కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.
– రాయగడ


ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు


కలశ పూజలను నిర్వహిస్తున్న దృశ్యం


పూజా కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు


కార్యక్రమంలో పాల్గొన్న సరస్వతీ మాఝి తదితర ప్రముఖులు

క్లుప్తంగా

తమ్మినాయుడుపేట ఇసుక రీచ్‌పై నిఘా

ఎచ్చెర్ల క్యాంపస్: ముఖ్యమంత్రి కార్యాలయాన్ని తరచూ ఫిర్యాదులు వెళ్తున్న తమ్మినాయుడుపేట ఇసుక రీచ్‌పై రెవెన్యూ, పోలీస్ అధాకారులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఇసుక తరలిస్తున్న పది ట్రాక్టర్లు గురువారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మైన్స్ విభాగానికి అప్పగించేలా కేసు నమోదు చేయాలని పోలీసులకు తహశీల్దార్ ఎ.సింహాచలం లేఖ అందజేశారు. ఈ మేరకు పోలీసులు మైన్స్‌కు అప్పగించనున్నారు. మరోవైపు స్థానిక రిజిస్ట్రేషన్లపై 70 ట్రాక్టర్లు ఉన్నట్లు సమాచారం. ఈ అంశంపై సైతం అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. ఉచితం ముసుగులో పోగులు వేయటం, రాత్రి వేళ విశాఖపట్నం తరలించటం వంటి ఘటనలపై ఆరాతీస్తున్నారు.

బొల్లినేనిలో మెడిస్కిల్స్‌లో ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్‌లో సర్టిఫికెట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్ మహీంద్రా ఫౌండేషన్, అమెజాన్ సంస్థలు తమ వెబ్ సెర్వీసెస్ రీసార్ట్ ప్రోగ్రాంలో భాగంగా డిగ్రీ(కంప్యూటర్) విద్యార్థులకు సర్టిఫికెట్ కోర్సు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 2022, 23, 24 సంవత్సరాల్లో ఇంజనీరింగ్,(కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ కంప్యూటర్స్ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. ప్రవేశపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ఉంటుందని, పూర్తి వివరాలకు 76809 45357 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జిల్లా ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సబ్–జూనియర్స్ ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించనున్నట్లు ఆర్చరీ సంఘ జిల్లా కార్యదర్శి ఎల్.చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అరసవల్లి రోడ్డులోని ఆదిత్య ఆర్చరీ అకాడమీలో ఉదయం 10 గంటల నుంచి ఎంపిక ప్రక్రియ మొదలవుతుందని పేర్కొన్నారు. ఎంపికైనవారిని ఈ నెల 23 నుంచి 25 వరకు రాజమండ్రి వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ ఆర్చరీ చాంపియన్‌షిప్–2024 పోటీలకు పంపిస్తామని తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, 3 పాస్‌ఫొటోలు, ఎంట్రీ ఫీజుతో ఎంపికలకు హాజరుకావాలని, పూర్తి వివరాలకు 94406 77201, 99899 78727 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఏపీ తూర్పుకాపు సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుమ్మడి


గుమ్మడి శాంతారావుకు నియామక పత్రం అందిస్తున్న చంద్రమోహన్

శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ): ఆంధ్రప్రదేశ్ తూర్పు కాపు సంక్షేమ సంఘం యువజన విభాగం శ్రీకాకుళం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుమ్మడి శాంతారావును నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని సంఘం జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా శాంతారావు మాట్లాడుతూ తూర్పుకాపు జాతి అభ్యున్నతికి నిరంతరం పనిచేస్తానని చెప్పారు. సంఘ పెద్దల సూచనల మేరకు ఎటువంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉంటానని తెలిపారు.

రైలు కిందపడి మహిళ మృతి

పొందూరు: పొందూరు–దూసి రైల్వేస్టేషన్ల మధ్య పెనుబర్తి సమీపంలో శుక్రవారం ప్రమాదవశాత్తు రైలు కింద పడి గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. మృతురాలి వయసు 60 ఏళ్లు ఉండవచ్చని, ఎర్రని చీరను ధరించి ఉందని చెప్పారు. వివరాలు తెలిసిన వారు 94907 27521 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

18.50 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, ద్విచక్రవాహనం

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి గంజాయిని అక్రమ రవాణా చేస్తుండగా పట్టుబడినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పీడీ ప్రసాద్ తెలిజేశారు. గురువారం ఒడిశా నుంచి చందన్‌కుమార్‌మహంతి అనే యువకుడు 18.50 కిలోల గంజాయిని ఒడిశా నుంచి ద్విచక్రవాహనంపై తీసుకొస్తుండగా పురుషోత్తపురం రైల్వే ఎల్‌సీ గేట్ వద్ద ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. అతని వద్ద నుంచి గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు. ఇందులో ఇన్‌స్పెక్టర్ జీవీ రమణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కరెన్సీతో అలంకరణ..


కరెన్సీ తోట్లతో అలంకరించిన లక్ష్మీ అమ్మవారి వేదిక

రాయగడ జిల్లాలోని గుడారిలో ధనలక్ష్మి పూజలు ఘనంగా కొనసాగాయి. మార్గశిర శుక్రవారం సందర్భంగా లక్ష్మీఅమ్మవారికి, గణపతి విగ్రహ వేదికలను కరెన్సీ నోట్లతో అలంకరించారు. సుమారు పది లక్షల రుపాయలతో నిర్వాహకులు అలంకరించారు. వీటిలో రూ. 50 రూపాయలు, రూ. వందనోట్లతో పాటు క్వాయిన్లతో అత్యంత సుందరంగా అలంకరించగా.. ఈ సుందర దృశ్యాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. కాగా ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. – రాయగడ


కరెన్సీ నోట్ల అలంకరణలో గణపతి వేదిక

రెండు సారా బట్టీలపై దాడి


సారా బట్టీల్లో సీజ్ చేసిన వంట సామగ్రితో అబ్కారీ, పోలీసు సిబ్బంది

జయపురం: జయపురం సమితి నీలాగుడ, కొలాగుడ ప్రాంతాల్లో రెండు సారా బట్టీలపై అధికారులు దాడులు చేశారు. సారా ఊటలను ధ్వంసం చేసినట్లు జయపురం అబ్కారీ ఇన్‌స్పెక్టర్ శశికాంత దత్ వెల్లడించారు. ధ్వంసం చేసిన నాటు సారా ఊటల విలువ రూ.60 వేలు ఉంటుందని తెలిపారు. నీలాగుడ, కొలాగుడ ప్రాంతాలలో నాటు సారా తయారు చేస్తున్న సమాచారం తెలిసి ఒక టీమ్‌గా ఏర్పడి దాడులు నిర్వహించామన్నారు. పోలీసులు వస్తున్నట్లు తెలుసుకున్న సారా మాఫియా పరారైందన్నారు. దాడుల్లో అబ్కారీ విభాగ ఐఐసీ బలరాం దాస్, సెటిలైట్ యూనిట్ ఏఎస్‌ఐ చంద్ర శేఖర రెడ్డి, సదర్ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ శిరీష మహాపాత్రో, ఏఎస్‌ఐ పంకజినీ సబర, ఉభయ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

30 వేల గంజాయి మొక్కలు ధ్వంసం


రాయగడ: గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

రాయగడ: గంజాయి సాగుపై పోలీసులు, అబ్కారీ అధికారులు నిరంతరంగా దాడులను నిర్వహిస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో సాగవుతున్న గంజాయిని అంతమొందించేందుకు లక్ష్యంగా తీసుకుని ఈ దాడులను నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అత్యధికంగా పద్మపూర్, గుడారి, రామనగుడ తదితర మారుమూల ప్రాంతాల్లో గంజాయి సాగు జోరుగా కొనసాగుతుండగా.. పోలీసు యంత్రాంగం దీన్ని అంతమొందించేందుకు నడుం బిగించింది. ఈ క్రమంల్లో రాజయగడ జిల్లా ఎస్పీ స్వాతి ఎస్ కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు కొద్ది నెలలుగా గంజాయి సాగవుతున్న ప్రాంతాలను గుర్తించి ఆకస్మికంగా దాడులను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పద్మపూర్ సమితి డొకరామ, నిధిగుడ ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ముమ్మరంగా దాడులు నిర్వహించి పది ఎకరాల్లో సాగు చేస్తున్న 30 వేల గంజాయి మొక్కలను కటింగ్ చేసి తగలబెట్టారు.


రాయగడ: కట్ చేసిన గంజాయి మొక్కలను తగుల బెడుతున్న పోలీసు సిబ్బంది

వికసిత ఒడిశా యువతరం బాధ్యత: ముఖ్యమంత్రి


కొత్తగా ఉద్యోగంలో చేరబోయే అభ్యర్థులతో ముఖ్యమంత్రి

భువనేశ్వర్: వికసిత, సమృద్ధి ఒడిశా నిర్మాణం యువతరం భుజస్కందాలపై ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. స్థానిక లోక్ సేవా భవన్‌లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమంలో 376 మందికి ఉద్యోగ నియామక పత్రాల్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ నియామక పత్రాలు సంకల్ప పత్రంగా పరిగణించి ప్రజల ప్రభుత్వంలో ప్రతినిధులుగా ప్రతి ఒక్కరు ప్రజల హితవు కోసం సేవలు అందించాలని ప్రోత్సహించారు. ప్రజాహితవు ఆకాంక్షగా బాధ్యతాయుతంగా ఉద్యోగ సేవలు అందజేస్తూ వికసిత, సమృద్ధి ఒడిశా నిర్మాతలుగా వెలుగొందాలని ముఖ్యమంత్రి ఉద్యోగ పరీక్షల ఉత్తీర్ణులకు అభినందించారు.

ఈ సందర్భంగా 85 మంది హోమియో వైద్యాధికారులు, 239 మంది రేడియోగ్రాఫర్లు, 52 మంది అధ్యాపకులకు ముఖ్యమంత్రి ఉద్యోగ నియామక పత్రాలు ప్రత్యక్షంగా అందజేశారు. స్థానిక లోక్ సేవా భవన్ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన నియామక మేళా కార్యక్రమంలో నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమానికి రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి సూర్య వంశీ సూరజ్ హాజరయ్యారు.


ఉద్యోగ నియామక పత్రం అందజేసిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

ఆటవిడుపు


స్థానిక కళింగ స్టేడియం సముదాయంలో బ్యాడ్మింటన్ సెంటర్ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఇలా ఆటవిడుపు ప్రదర్శించారు. ఆయనతో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వా కాసేపు రాకెట్లతో బ్యాడ్మింటన్ ఆడారు. – భువనేశ్వర్

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : లావేరు మండలం పాతకుంకాంలోని ఎరువుల దుకాణంలో శుక్రవారం విజిలెన్స్ తనిఖీలు నిర్వహించారు. ఏపీ విజిలెన్స్ డీజీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బర్ల ప్రసాదరావు ఆధ్వర్యంలో సిబ్బంది పాత కుంకాంతో పాటు విజయనగరం జిల్లా కర్ణం గ్రామంలో కూడా తనిఖీలు చేపట్టారు. రూ.9,59,098 విలువైన 70.545 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసి 6ఏ కేసులు నమోదు చేశారు. సరుకు వ్యత్యాసాలు, కాలం చెల్లిన పురుగు మందుల అమ్మకం వంటి అవకతవకలు గుర్తించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి ప్రసాదరావు మాట్లాడుతూ ఎరువుల అక్రమ వ్యాపారంపై నిఘా ఉంచామని, తనిఖీల్లో పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కబేళాలకు పశువుల తరలింపు

● ఐదుగురిపై కేసు నమోదు


అక్రమంగా కబేళాలకు తరలిస్తున్న పశువులు

ఆమదాలవలస: కొత్తూరు మండలం బలద గ్రామం నుంచి ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని చింతాడ సంతకు 34 పశువులను తోడ్కొని రావడాన్ని గమనించిన స్థానికులు శుక్రవారం పోలీసులకు సమాచారం అందించారు. పార్వతీశ్వరునిపేట సమీపంలో పశువులను అడ్డుకొని వాటిని తీసుకుకొస్తున్న వారిని విచారించారు. కబేళాలకు తరలిస్తున్నట్లు గుర్తించి త్రినాథ్, శంకర్, శేఖర్‌లతోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. పశువులను స్వాధీనం చేసుకొని కొత్తవలస గోశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు సాధు కిరణ్, చింతాడ అప్పారావు, బజరంగ్‌దళ్ ఈశ్వర్, హిందూపరిషత్ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పశుసంవర్థకశాఖ ఏడీ రోణంకి ఆనందరావు పశువుల రక్షణకు చర్యలు చేపట్టారు.

ఉత్సాహంగా జిల్లా బాక్సింగ్ ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: బాక్సింగ్ క్రీడాకారుల ఎంపికలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళం కోడిరామ్మూర్తి క్రీడా ప్రాంగణంలో జరిగిన ఈ ఎంపికలను తొలుత డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి 48 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్‌లో బాక్సింగ్ క్రీడకు విశ్వవ్యాప్తంగా ఆదరణ, గుర్తింపు ఉందన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి జిల్లాకు, తల్లిదండ్రులకు, కోచ్‌లకు గౌరవాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు.

19, 20 తేదీల్లో రాష్ట్ర పోటీలు..

ఇక్కడ ఎంపికైన క్రీడాకారులను పిఠాపురంలో ఈ నెల 19, 20 తేదీల్లో జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బలగ అనంత లక్ష్మణ్‌దేవ్ (అను) పేర్కొన్నారు. గత ఏడాది స్టేట్‌మీట్‌లో శ్రీకాకుళం జిల్లా చాంపియన్‌షిప్‌ను కై వశం చేసుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేస్తు.. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులనే రాష్ట్రపోటీలకు పంపిస్తామన్నారు. అనంతరం ఎంపికైన క్రీడాకారుల జాబితాను వెల్లడించారు. వీరికి భీమేశ్వర బాక్సింగ్ క్లబ్ అధ్యక్షుడు బలగ సీతారాం అభినందనలు తెలిపి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ బాక్సింగ్ కోచ్ ఉమామహేశ్వరరావు, సీనియర్ బాక్సర్లు జి.రాజీవ్, బి.చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

రాష్ట్రస్థాయి పోటీలకు సీహెచ్ జ్ఞానేశ్వరరావు (55 కేజీలు), పి.అప్పలరాజు (60 కేజీలు), పి.జాను (65 కేజీలు), ఎం.లోకేష్ (70 కేజీలు), ఎస్.ఏసు (75 కేజీలు), కె.శ్రీకాంత్ (80 కేజీలు), ఎల్.అభిరామ్ (85 కేజీలు), డి.మోజ్‌కుమార్ (90 కేజీలు), ఆర్.హేమంత్‌కుమార్ (90+కేజీలు) బరువు కేటగిరీల్లో ఎంపికయ్యారు.

క్లుప్తంగా

పత్తిని కొనుగోలు కేంద్రంలో విక్రయించాలి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో రైతులు పండించే పత్తిని కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధర పొందాలని జిల్లా అగ్రిట్రేడ్, మార్కెటింగ్ అధికారి ఐ.గంగాధర రావు తెలిపారు. దళారుల మాటలు విని మోసపోవద్దని హితవు పలికారు. పత్తి రైతుల సౌకర్యార్థం సాలూరు మార్కెట్ యార్డులో గత నెల 8వ తేదీన కేంద్ర ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన జారీచేశారు. పత్తిని కేంద్ర ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ ద్వారా కొనుకోలు చేస్తున్నట్లు తెలిపారు. పత్తి రైతులు పత్తిని బాగా ఆరబెట్టి, శుభ్రపరచి కొనుగోలు కేంద్రంకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు.

నేడు అడ్డాపుశీల గిరి ప్రదక్షిణ

పార్వతీపురంటౌన్: మండలంలోని అడ్డాపుశీల గిరి ప్రదక్షిణ శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు శ్రీనివాస పాఢి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ గిరి ప్రదక్షిణ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు జరుగుతుందన్నారు. శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయము నుంచి ప్రారంభమై పార్వతీపురం- పాలకొండ హైవే రోడ్డుకు వెళ్లి కొంకిడివరం రోడ్డు మీదుగా కొండపైకి ఎక్కి టిడ్కో గృహాలపై నుంచి అడ్డాపుశీల గ్రామంలోకి ప్రవేశించి మళ్లీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోనికి వచ్చేవిధంగా గిరి ప్రదక్షిణ ఉంటుందన్నారు. చెప్పులతో గిరి ప్రదక్షిణ చేయవచ్చునని స్పష్టం చేశారు. మార్గ మధ్యంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. గిరి ప్రదక్షిణ చేసి ఆలయానికి చేరుకున్న భక్తులతో సామూహిక హారతిని స్వామికి సమర్పించనున్నామన్నారు. దారి పొడవున లైటింగ్ ఏర్పాటు చేశామని, గిరి ప్రదక్షిణ సుమారు 5 నుంచి 6 కిలోమీటర్ల దూరం ఉంటుందని వివరించారు.

15న జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 15న నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కేవీ ప్రభావతి శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడామైదానంలో జరిగే ఎంపిక పోటీల్లో 70 కేజీలలోపు బరువు కలిగిన బాలుర క్రీడాకారులు, 65 కేజీల లోపు బరువు కలిగిన బాలికలు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. క్రీడాకారుల వయస్సు 20 సంవత్సరాల మించకూడదని స్పష్టం చేశారు. జిల్లా స్థాయిలో జరిగిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరగనున్న అంతర్ జిల్లాల జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ పోటీలకు ఎంపిక చేయనున్నామన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు ఫోన్ 9949721949 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



విజయనగరం క్రైమ్: రైల్లో ప్రయాణిస్తూ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు జీఆర్‌పీ ఎస్సై వి.బాలాజీరావు శుక్రవారం తెలిపారు. టాటానగర్ నుంచి ఎర్నాకులం వెళ్తున్న టాటానగర్ ఎక్స్‌ప్రెస్ ఎస్-1కోచ్ బెర్త్ నంబర్ 32లో ప్రయాణిస్తూ అపస్మారక స్థితిలో సుమారు 40 నుంచి 45 ఏళ్ల వ్యక్తి ఉండడాన్ని గుర్తించిన ప్రయాణికులు రైల్వే అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో విజయనగరం రైల్వేస్టేషన్ వద్ద ఆ వ్యక్తిని దించి రైల్వే డ్యూటీ డాక్టర్ పరీక్షలు నిర్వహించి, మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రి మార్చురీకి తరలించారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే విజయనగరం జీఆర్‌పీ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. వివరాలకు ఫోన్ 9490617089 నంబర్‌ను కాంటాక్ట్ చేయాలని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

సాలూరు: ఆర్టీసీ డిపోలో కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఆర్టీసీ యూనియన్ రీజనల్ సెక్రటరీ సుందరరావు, రెండు యూనియన్‌ల (ఎన్ఎంయు, ఎంప్లాయీస్ యూనియన్) సెక్రటరీలు ఎమ్ఎస్ నారాయణ, పి.శేఖర్ తదితరులు స్పష్టం చేశారు. ఆర్టీసీ డీఎం తీరుకు నిరసనగా శుక్రవారం సాలూరు డిపో వద్ద పలువురు కార్మికులతో కలిసి రెండవ రోజు గేట్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డిపోల సమస్యలపై రెండు యూనియన్‌ల నాయకులు ఒకటిగా కలిసి మేనేజ్‌మెంట్‌కు లేఖ ఇచ్చినప్పటికీ మేనేజ్‌మెంట్ చర్చలకు పిలవలేదన్నారు. డిపో మేనేజర్ మొండి వైఖరిని అవలంబిస్తున్నారని విమర్శించారు. ఈ మధ్య కాలంలో డిపోకు 12 కొత్త బస్సులు ఇస్తామన్నప్పటికీ, తమకు కొత్త బస్సులు వద్దని డీఎం ఆపివేశారని ఆరోపించారు. అంతేకాకుండా పాత స్క్రాప్ బస్సులతో కేఎంపీఎల్ తీసుకురావాలని, అలా తేలేకపోయిన డ్రైవర్లకు కౌన్సెలింగ్‌లు, పనిష్మెంట్లు ఇస్తున్నారని వాపోయారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు డీఎస్‌రావు, పి.సుందరరావు, త్రినాథ్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధుల బారిన జనం

- 1,04,729 మందిని సర్వే చేసిన వైద్య సిబ్బంది
- వ్యాధుల బారిన పడిన వారు 25,519 మంది
- 52,180 మందికి వివిధ వ్యాధి లక్షణాలు
- 14,789 మందికి బీపీ
- 10,512 మందికి సుగర్
- 160 మందికి కేన్సర్ నిర్ధారణ

వ్యాధి పేరు	రోగుల సంఖ్య	అనుమానితుల సంఖ్య
బీపీ	14,789	11,352
సుగర్	10,512	13089
ఓరల్ కేన్సర్	45	407
బ్రెస్ట్ కేన్సర్	54	427
సర్వైకల్‌కేన్సర్	61	452
సీఓపీడీ	37	12,644
కుష్ఠు	21	351
లివర్‌సమస్యలు	0	10,482
ఫిట్స్	0	88
కంటిసమస్యలు	0	1517
వినికిడిసమస్య	0	400
క్షయ	0	952



సోంపురం గ్రామంలో మహిళకు బీపీ పరీక్ష చేస్తున్న వైద్యసిబ్బంది



వృద్ధురాలి దంతాలను పరీక్షిస్తున్న సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: మానవుని జీవన శైలిలో మార్పులు, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారం తినడం తదితర కారణాల వల్ల జనం దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. వైద్యసిబ్బంది సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. వైద్యసిబ్బంది సర్వేలో బీపీ, సుగర్, కేన్సర్, కుష్ఠు సీఓపీడీ వంటి వ్యాధుల బారిన ప్రజలు పడినట్లు గుర్తించారు. అదేవిధంగా మరి కొంతమంది వివిధ రకాల వ్యాధుల లక్షణాలతో ఉన్నట్లు గుర్తించారు. సర్వేచేసిన వారిలో సగం మందిలో వివిధ రకాల వ్యాధి లక్షణాలు (అనుమానిత) ఉన్నట్లు గుర్తించారు. పూర్వ కాలంలో వ్యాయామం, మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల బలంగా, ఆరోగ్యంగా ఉండేవారు. బీపీ, సుగర్ వంటి వ్యాధులు 50, 60 ఏళ్లు దాటిన వారికి వచ్చేవి. కానీ ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా 20, 30 ఏళ్లకే బీపీ, సుగర్ వ్యాధుల బారిన పడుతున్నారు.

జిల్లా జనాభా 15, 35, 657 మంది

జిల్లాలో జనాభా 15, 35, 657 మంది. వారందరినీ వైద్యసిబ్బంది సర్వే చేయనున్నారు. నవంబర్ 14 నుంచి దీర్ఘకాలిక వ్యాధుల సర్వే ప్రారంభమైంది. ఇప్పటి వరకు 1, 04,729 మందిని సర్వే చేశారు. వారిలో 25, 519 మందికి బీపీ, సుగర్, కేన్సర్, సీఓపీడీ, కుష్ఠు వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయింది. బీపీ 14,0789 మందికి, సుగర్ 10,512 మందికి ఉన్నట్లు నిర్ధారణ కాగా వ్యాధి లక్షణాలు 52,180 మందికి ఉన్నట్లు సర్వేలో గుర్తించారు.

ఆందోళన కలిగిస్తున్న అంశం

ప్రజల్లో దీర్ఘకాలిక వ్యాధులు పెరగడం ఆందోళన కల్గిస్తున్న అంశం. బీపీ. సుగర్‌తో పాటు కేన్సర్ వ్యాధి పెరుగుతోంది. అదేవిధంగా లివర్ సంబంధిత వ్యాధిగ్రస్తులు, సీఓపీడీ, కంటి సమస్యలు ఉన్న వారి సంఖ్య పెరుగుతోంది.

జిల్లాలో సర్వే

దీర్ఘకాలిక వ్యాధులపై జిల్లాలో ఉన్న ప్రజలందరినీ వైద్య సిబ్బంది సర్వే చేస్తున్నారు. ఇప్పటికే లక్ష మందికి పైగా సర్వే చేశారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి చికిత్స వెంటనే ప్రారంభించనున్నాం. వ్యాధి లక్షణాలు ఉన్నవారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తాం.

డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఎన్‌సీడీ పీఓ.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- శిక్షణ కార్యక్రమంలో పిలుపునిచ్చిన డీఎంహెచ్ఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

పార్వతీపురంటౌన్: జిల్లాలోని హైరిస్క్ గర్భిణులపై ఏఎన్ఎంలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ కె.విజయ పార్వతి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం స్థానిక ఎన్‌జీఓ హోంలో హైరిస్క్ గర్భిణుల నిర్వహణ, నియయాలపై ఏఎన్ఎంలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎంహెచ్ఓ హాజరై శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణుల పట్ల శ్రద్ధ వహిస్తున్నప్పటికీ, హైరిస్క్ గర్భిణుల పట్ల మరింత ప్రత్యేక శ్రద్ధ అవసరమని సూచించారు. ముఖ్యంగా హైరిస్క్ గర్భిణుల గత ప్రమాద చరిత్ర, ఎనీమియా, టీబీ, సుగర్, ఫిట్స్, రక్తస్రావం తదితర లక్షణాల గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని, అటువంటి వారికి అవసరమైన చికిత్స అందించి సుఖ ప్రసవాలు జరిగేలా చూడాలని కోరారు. అత్యవసర సమయాల్లో మాత్రమే గర్భిణులను ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో శిక్షణ అధికారి డా.ఎ.కృష్ణమూర్తి, సమన్వయకర్త కె.ప్రశాంత్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.కె.పద్మావతి, డీపీహెచ్ఎన్ఓ ఉషారాణి, డీపీఓ లీలారాణి, డెమో వి.సన్యాసిరావు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సృష్టికి జీవం స్త్రీ

- జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి



జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతిని సత్కరిస్తున్న పెద్దలు

విజయనగరం అర్బన్: సమాజ నిర్మాత, సృష్టికి జీవం స్త్రీ అని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి అన్నారు. సేవా భారతి, జాతీయ మానవ హక్కుల కమిషన్ సంయుక్తంగా శ్రీకాకుళంలో నిర్వహించిన సదస్సులో ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం ప్రాంత సేవాభారతి జాయింట్ సెక్రటరీ, మహిళా ప్రముఖ్ గుండ్రెడ్డి సంయుక్త నిర్వహణలో సదస్సు జరిగింది. సమావేశంలో విజయభారతి మాట్లాడుతూ మహిళలు అత్యంత శక్తిమంతులని, వేద కాలం, స్వాతంత్ర్యోద్యమ కాలంలో మహిళలు స్వతంత్ర నిర్ణయాలు తీసుకొని వాటి అమలకు గట్టిగా కృషిచేశారన్నారు. అనంతరం కమిషన్ చైర్‌పర్సన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు, డైరెక్టర్ సంయుక్త, కరస్పాండెంట్ రంగారావు, ఏసీటీఓ రాణిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాక్‌థాన్ విజేతలుగా జీఎంఆర్ ఐటీ విద్యార్థులు



హ్యాకథాన్ ట్రోఫీతో జీఎంఆర్ ఐటీ విద్యార్థులు

రాజాం సిటీ: స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2024 విజేతలుగా స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థులు నిలిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 11,12తేదీలలో బెంగళూరులోని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీలో అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో జరిగాయి. సంస్థలు, రాజ్యాంగం పేరుతో వినూత్న డిజిటల్ పరిష్కారాన్ని అభివృద్ధి చేసే దిశగా తమ విద్యార్థులు పోటీల్లో ప్రదర్శనలు ఇచ్చారని తెలిపారు. ప్రజలకు రాజ్యాంగంపై అవగాహన కల్పించే గేమిఫైడ్ ప్లాట్‌ఫారంగా రూపొందించారని చెప్పారు. ముఖ్యంగా భారత రాజ్యాంగంలోని 5, 6వ భాగాలు సులభతరంగా శాసనసభ, కార్య నిర్వాహక వర్గం, న్యాయవర్గంపై ఆధారపడిన భాగాలకు సులభమైన భాషలో, వినోదాత్మక పద్ధతిలో ప్రజలకు వివరించడమే దీని లక్ష్యమన్నారు. వినూత్న ఆలోచనతో రూపొందించిన ప్రాజెక్టును హ్యాకథాన్ జ్యూరీ సభ్యులు విజేతగా ఎంపిక చేసి నగదు బహుమతితోపాటు ట్రోఫీ అందజేశారని తెలియజేశారు. టీమ్‌లోని విద్యార్థులు బి.మౌర్య, వి. తేజవర్ధిత్, ఎ.ప్రవల్లిక, బి.సుప్రజ, ఎం.విజయ్, సీహెచ్ జగదీష్‌లను ప్రిన్సిపాల్‌తోపాటు డాక్టర్ జె.గిరీష్, అధ్యాపకులు అభినందించారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్‌మోహన్‌రావు
- దోనుబాయి, కుశిమి పీహెచ్‌సీల సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న ప్రోగ్రాం అధికారి జగన్‌మోహన్‌రావు

సీతంపేట: విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్‌మోహన్‌రావు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సీతంపేట మండలంలోని దోనుబాయి, కుశిమి పీహెచ్‌సీలను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు నమోదు పరిశీలించారు. వైద్యసేవలు అందుతున్న తీరును ఆయా విభాగాల వారీగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. రక్త, మూత్ర పరీక్షల నివేదికలు సకాలంలో తెలియజేస్తున్నారా? లేదా అనేది తేదీలను చూశారు. పరికరాల్లో సాంకేతిక లోపాలు తలెత్తకుండా సక్రమంగా ఉపయోగించి జాగ్రత్తపడాలని సూచిం చారు. సాధారణ ప్రసవాలు నిర్వహించడానికి అవసరమైన వైద్య పరికరాలు, ఇంజక్షన్లు, మౌలిక సదుపాయాల లభ్యతను పరిశీలించారు. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య మెరుగుపడాలని సూచించారు. కార్యచరణ ఎలా చేస్తున్నారని సూపర్‌వైజర్లను ప్రశ్నించారు. కుక్కకాటు, పాము కాటు వ్యాక్సిన్లను చూశారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ సక్రమంగా ఉండాలని చెప్పారు. సాయంత్రం, రాత్రి వేళల్లో షిఫ్ట్ డ్యూటీలు, టూర్‌డైరీలు సక్రమంగా ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సీహెచ్ చాందిని, వి.శివశంకర్ ఆరోగ్య కార్యాలయం డెమో యోగీశ్వరరెడ్డి, జయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోలమాంబ జాతరలో కానుకల వేలంపాట



పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి జాతర వచ్చే ఏడాది జనవరి 27,28,29వతేదీల్లో జరగనుంది. జాతరలో అమ్మవారికి భక్తులు సమర్పించుకోనున్న కానుకలకు శుక్రవారం చదురుగుడిలో ఈవో వి.వి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. జాతరలో భక్తులు సమర్పించుకోనున్న చీరలు, జాకెట్లకు రూ.4,05,000, కొబ్బరిముక్కలకు రూ.5,51,000, తలనీలాలు రూ.3,37,600, అమ్మవారి లామినేషన్ ఫొటోలకు రూ.1,52,000, దీపాలకు రూ.2,21,000 వేలంపాట ద్వారా ఆదాయం వచ్చినట్లు ఈవో సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో వేలంపాట పర్యవేక్షణాధికారి టి.రమేష్, సర్పంచ్ సింహాచలమమ్మ, ఎంపీటీసీ తీళ్ల పోలినాయుడు, గ్రామపెద్దలు, ఆలయ ఆశాదీలు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతోనే అభివృద్ధి సాధ్యం

- కేంద్రీయ యూనివర్సటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి
- ఓపెన్ యాక్సెస్ పబ్లిషింగ్‌పై సపోర్టెడ్ వర్క్‌షాప్ ప్రారంభం



వర్క్‌షాప్ రిసోర్స్ పర్సన్స్, విద్యార్థులతో యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి

విజయనగరం అర్బన్: నూతన ఆవిష్కరణలతోనే ఏ దేశమైనా అభివృద్ధి సాధించగలుగుతుందని ఆ దిశగా కళాశాలలు, యూనివర్సిటీ స్థాయిలో విద్యాబోధన జరగాలని కేంద్రీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి అన్నారు. ఈ మేరకు విజయనగరంలోని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో ఐఐటీ ఢిల్లీ సహకారంతో ఓపెన్ యాక్సెస్ పబ్లిషింగ్ అంశంపై రెండురోజుల పాటు నిర్వహించే 'ఆర్కిడ్ జీపీఎఫ్-2024' సపోర్టెడ్ వర్క్‌షాప్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశోధన, అకాడెమియా ఓపెన్ యాక్సెస్ పబ్లిషింగ్ ప్రాధాన్యాన్ని వివరించారు. ఇలాంటి వర్క్ షాప్‌ల ద్వారా పరిశోధకులు తమ పరిశోధనల వ్యాప్తిని విస్తృతం చేయవచ్చని తద్వారా ప్రపంచ సహకారాన్ని, ఆవిష్కరణలను ప్రోత్సహించవచ్చన్నారు. వర్క్‌షాప్‌లో రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించిన ఐఐటీ ఢిల్లీ లైబ్రేరియన్ హెడ్ డాక్టర్ నబీ హాసన్, అసిస్టెంట్ లైబ్రేరియన్ డాక్టర్ మోహిత్ గార్గ్, యునెస్కో పబ్లిసింగ్ ఎథిక్స్, ఓపెన్ యాక్సెస్ మోడల్స్, ఓపెన్ పబ్లిక్ లైసెన్సింగ్, ఓపెన్ యాక్సెస్ పబ్లిషింగ్‌లో నైతిక ప్రమాణాలు, ఓపెన్ పబ్లిషింగ్ ప్లాట్‌ఫామ్‌ల ప్రభావవంతమైన వినియోగం గురించి వివరించారు. ప్రారంభ సెషన్‌లో స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ డీన్ ప్రొఫెసర్ ఎం.శరత్‌చంద్రబాబు, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవి, కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.నారాయణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, డాక్టర్ ప్రమథటర్జీ, కమిటీ సభ్యులు, అధ్యాపకులు హాజరయ్యారు. కార్యక్రమంలో పట్టణానికి సమీపంలో ఉన్న వివిధ కళాశాలలు, ఆంధ్రయూనివర్సిటీ, నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి అధ్యాపకులు, లైబ్రేరియన్స్, పరిశోధనా విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

- డీఎస్పీ శ్రీనివాసరావు
- కొట్టక్కి పోలీస్ చెక్ పోస్టు వద్ద 810 కిలోల గంజాయి పట్టివేత
- ముగ్గురు నిందితుల అరెస్టు
- పరారీలో మరో నలుగురు నిందితులు
- మూడు వాహనాలు స్వాధీనం



పోలీస్‌స్టేషన్ ఆవరణలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు, పక్కన సీఐ నారాయణరావు



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు, నంబర్ ప్లేట్లు, పోలీస్ నేమ్ బోర్డు

రామభద్రపురం: గంజాయి అక్రమరవాణా నియంత్రణకు ప్రత్యేక నిఘా పెట్టామని డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు.ఒడిశా నుంచి మధ్యప్రదేశ్‌కు అక్రమంగా గంజాయి రవాణాచేస్తున్న లారీ, మహీంద్రా వ్యాన్, బొలెరో కారును కొట్టక్కి చెక్ పోస్టు వద్ద రామభద్రపురం పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా 810 కిలోల గంజాయిని, మూడు వాహనాలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు అక్రమ రవాణాదారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బొబ్బిలి సీఐ నారాయణరావు, ఎస్సై వి.ప్రసాదరావుతో కలిసి డీఎస్పీ పి.శ్రీనివాసరావు విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామభద్రపురం మండలం కొట్టక్కి వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులో వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో సాలూరు నుంచి ఓ బొలెరో కారు వస్తుండగా అనుమానంతో ఆపి చెక్ చేస్తున్న సమయంలో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు దిగి పారిపోయారు. వారెందుకు పారిపోతున్నారన్న అనుమానంతో కారు చెక్ చేయగా డ్రైవర్ దొరికాడు. ఆ కారులో 30 కిలోల గంజాయి ఉంది. అలాగే అదే రూట్‌లో మరో మహీంద్రా గూడ్స్ వ్యాన్ వస్తుండగా ఆపేసరికి పోలీసులను చూసి అందులో ఉన్న డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి పారిపోయాడు. ఆ గూడ్స్ వ్యాన్‌లో మరో 30 కిలోల గంజాయి పట్టుబడింది. అలాగే ఆ వెనకాల ఓ లారీ బొగ్గులోడుతో వస్తుండగా లారీని ఆపి చెక్ చేయగా లారీలో పైన బొగ్గు బస్తాలు ఉండగా మధ్యలో 25 గంజాయి బస్తాలు, కిందన మళ్లీ బొగ్గు బస్తాలు వేసుకుని గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నారు. లారీ డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకుని మూడు వాహనాల్లో మొత్తం గంజాయితో పాటు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న ముగ్గురు నిందితులను విచారణ చేయగా లారీలో ఉన్న వారు మధ్యప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ హుకుం సోలంకి, క్లీనర్ అనిల్ సోలంకిలు తండ్రీకొడుకులుగా తెలిసింది. వారు గంగవరం పోర్టులో బొగ్గు లోడు చేసుకుని మధ్యప్రదేశ్ వెళ్తున్నారు. వారు రామభద్రపురం మీదుగా మధ్యప్రదేశ్‌కు వెళ్లాల్సి ఉండగా డబ్బులకు ఆశపడి సాలూరు రూరల్ పరిధిలోని గ్రీన్ హైవేకు వెళ్లి అక్కడ 25 గంజాయి బస్తాలు లోడు చేసుకుని తిరిగి రామభద్రపురం మీదుగా వెళ్లేందుకు వస్తున్నారు. అలాగే బొలెరో కారు డ్రైవర్ కొరాపుట్‌కు చెందిన జ్యోతి బూషన్ బెహరాగా విచారణలో తెలిసింది. మూడు వాహనాలలో ఉన్న మొత్తం 810 కిలోల గంజాయిని, వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రిమాండ్‌కు ముగ్గురు నిందితులు

ఎ1గా హుకుం సోలంకి, ఎ2గా అనిల్ సోలంకి, ఎ3గా జ్యోతి బూషన్ బెహరాపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. బొలెరో కారులో వేరే వేరే నంబర్లతో ఉన్న నంబర్ ప్లేట్లు, పోలీసు వ్యాన్ అనే బోర్డు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పరారైన వారితో పాటు గంజాయి అక్రమ రవాణా వెనుక ప్రధాన పాత్రధారులు ఎవరున్నారో పట్టుకునేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అక్రమంగా రవాణా అవుతున్న గంజాయిని మాటు వేసి పట్టుకునేందుకు కృషి చేసిన ఎస్సై వి.ప్రసాదరావు, కానిస్టేబుల్ విష్ణులను అభినందిస్తూ రివార్డులకు ప్రతిపాదించినట్లు డీఎస్పీ తెలిపారు.

318 కేజీల గంజాయి పట్టివేత

సాలూరు: పాచిపెంట మండలం మీదుగా కారులో విశాఖపట్నం తరలిస్తున్న 318 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు పాచిపెంట ఎస్సై వెంకటసురేష్, తన సిబ్బందితో కలిసి పాచిపెంట మండలంలోని మాతుమూరు జంక్షన్ మాటువేసి కారులో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నారన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న విజయనగరం జిల్లా ఎస్‌కోట మండలం టి.బొడ్డవరకు చెందిన వంశీ, అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలానికి చెందిన సుబ్బారావులను అదుపులోకి తీసుకున్నామని, దీనిపై విచారణ చేస్తామని తెలిపారు. సమావేశంలో పట్టణ, రూరల్ సీఐలు అప్పలనాయుడు, రామకృష్ణ, పాచిపెంట, సాలూరు రూరల్ ఎస్సైలు వెంకటసురేష్, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్‌లో మన్యం జిల్లా జట్టుకు మూడవ స్థానం



మూడవ స్థానంలో నిలిచిన మన్యం జిల్లా దివ్యాంగుల జట్టు

భామిని: దివ్యాంగుల క్రికెట్ పోటీల్లో పార్వతీపురం మన్యం జిల్లా జట్టు మూడవ స్థానంలో నిలిచింది. విశాఖపట్నంలోని జింక్ మైదానంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో 10 క్రికెట్ జట్లు పోటీ పడగా పార్వతీపురం మన్యం జట్టు మూడవ స్థానంలో నిలిచినట్లు జిల్లా జట్టు అధ్యక్షుడు కేవటి శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు.ఫైనల్‌లో గుంటూరు జట్టుపై మన్యం జిల్లా జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 178 పరుగులు సాధించినట్లు పేర్కొన్నారు. విజేతల ఓవర్‌రేట్‌కు పరుగులు లెక్కించి తమ జట్టుకు మూడవ స్థానం ప్రకటించినట్లు తెలిపారు. థర్డ్ ప్రైజ్ అందించి అభినందించారన్నారు.

17న జాబ్‌మేళా

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 17న జాబ్‌మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ, ఐటీఐ సంయుక్తంగా నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాకు 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణులైన 18 నుంచి 35 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీయువకులు అర్హులని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాకు 20 నుంచి 50 హెల్త్‌కేర్, హెటిరో డ్రగ్స్ తదితర బహుళజాతి కంపెనీలు హాజరుకానున్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన యువతీయువకులు హెచ్‌టీటీపీ//ఎన్ఏఐపీయాఎన్‌వైఏఎం.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని అడ్మిట్ కార్డుతోపాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్స్ ఒరిజినల్, జిరాక్స్‌తోపాటు ఒక పాస్‌పోర్టు సైజు ఫొటోతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 7286042743, 998853335 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మీడియా స్వేచ్ఛకు భంగం కల్పించడం నేరం

- కలెక్టరేట్ వద్ద ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు, మీడియా ప్రతినిధులు



జిల్లా రెవెన్యూ అధికారి హేమలతకు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

పార్వతీపురంటౌన్: మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించడం నేరమని ఏపీయూడబ్ల్యూజే పార్వతీపురం మన్యం జిల్లా శాఖ అధ్యక్షుడు కిషోర్, ఉపాధ్యక్షుడు ఆశపు జయంత్ అన్నారు. వైఎస్సార్ కడప జిల్లాలోని వేముల మండలంలో సాగునీటి సంఘం ఎన్నికలను కవర్ చేయడానికి వెళ్లిన సాక్షి బృందంపై అక్కడి అధికార పార్టీ నాయకులు దాడులకు పాల్పడి గాయపరచడం బాధాకరమన్నారు. విధుల నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులు చేయడాన్ని ఖండించారు. ఇది పత్రికాస్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి దాడులను ప్రభుత్వం ప్రోత్సహించకూడదని చెప్పారు. నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై హత్యాయత్నం కింద కేసులు నమోదు చేయాలని కోరారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీస్ యంత్రాంగంపై ఉందన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి హేమలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో 'సాక్షి' ప్రతినిధులు కోట రామకృష్ణ, మహందాత నాయుడు, నవీన్, మీడియా ప్రతినిధులు రెల్లి శంకరరావు, సుధాకర్, బి.రాము, శేఖర్, శ్రీనివాసరావు, సుధాకర్, రామారావు, ఎ.శేఖర్, వంశీ, ఎద్దు చిన్నారావు, కె.ఎ.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.